గణేశ శరణం.. శరణం గణేశా !


మేడ్చల్ జోన్ పరిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయక చవితి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఆదివారం గణపతి మండపాలతో పాటు ఇళ్లలో గణపయ్యకు భక్తులు ప్రత్యేక పూజలు చేసి ఉండ్రాలు నైవేద్యంగా సమర్పించారు. పలుచోట్ల అన్నదానం, విశేష కార్యక్రమాలు నిర్వహించిన యువజన సంఘాలు, కుల సంఘాలు, నాయకులు మండపాలను అందంగా ముస్తాబు చేశారు. పలు మండపాల్లో ప్రజా ప్రతినిధులు హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు చేయగా.. నిర్వాహకులు వారిని ఘనంగా సత్కరించారు. – మేడ్చల్ జోన్ బృందం


పూడూర్‌లో భవానీ యూత్ ఆధ్వర్యంలో ఎంపీ ఈటల


నాగారం రామకృష్ణానగర్‌కాలనీలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి


ఘట్‌కేసర్ ఈడబ్ల్యూఎస్ కాలనీలో చైర్‌పర్సన్ పావనీజంగయ్య


అన్నోజిగూడలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి


ఆర్‌కే శివాజీ మండపంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


గుండ్లపోచంపల్లిలో కాంగ్రెస్ నేతలు, యువకులు


చీర్యాలలో ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ తదితరులు

వినాయకసాగర్‌ను సందర్శించిన సీపీ


నిమజ్జన ఏర్పాట్లపై ఆరా తీస్తున్న సీపీ సుధీర్‌బాబు, డీసీపీ పద్మజారెడ్డి

ఘట్‌కేసర్ : ఎదులాబాద్ వినాయకసాగర్ శ్రీలక్ష్మీనారాయణ చెరువును రాచకొండ సీపీ సుధీర్‌బాబు, మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజారెడ్డితో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా చెరువులో జరుగనున్న నిమజ్జనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. చెరువు లోతు, విగ్రహాల ఎత్తు, ఇతర ఏర్పాట్లపై ఆరా తీశారు. గణేశ్ విగ్రహాల నిమజ్జనం సజావుగా సాగేందుకు అవసరమైన క్రేన్లు, భారీకేడ్లు, తాగునీటి వసతి, గజ ఈతగాళ్లు, లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏసీపీ చక్రపాణి, సీఐలు సైదులు, రాజువర్మ, డీఐ శ్రీనివాసులు ఇతర పోలీస్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు వైఎస్సార్ ట్రస్ట్ సాయం


నిత్యావసరాలను అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఖమ్మం వరద బాధితులకు స్థానిక వైఎస్సార్ ట్రస్ట్ అండగా నిలిచింది. మాజీ ఎంపీపీ, ట్రస్ట్ వ్యవస్థాపకుడు అవుషాపూర్ గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డి ఖమ్మం మున్నేరు, వాగేరు వాగు పరిసర ప్రాంతాలను ఆదివారం సందర్శించారు. అనంతరం వరద బాధితులకు నిత్యవసర సరుకులను అందజేశారు. కరుణాకర్, సత్యానారాయణరెడ్డి, వంశీ, మైపాల్‌రెడ్డి, మల్లేష్, రాజశేఖర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, భానుయాదవ్, మహేష్, ప్రేమ్‌చంద్‌గౌడ్, అరుణ్, లక్ష్మణ్, మనీష్‌రెడ్డి, సరయు రెడ్డి, జాస్యరెడ్డి పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కౌన్సిలర్


సీఎం రేవంత్‌రెడ్డితో కౌన్సిలర్ వెంకటేశ్‌గౌడ్

పోచారం: సీఎం రేవంత్ రెడ్డిని పోచారం మున్సిపాలిటీ 10వ వార్డు కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్‌గౌడ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలగోని మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో అహర్నిశలు శ్రమిస్తున్న రేవంత్ రెడ్డి అభినందనీయులన్నారు. ఆయన సహకారంతో పోచారం మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మీడియా కో–ఆర్డినేటర్ శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు అంబేద్కర్ ఎనలేని కృషి


మాట్లాడుతున్న బిక్షపతి, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: అణగారిన కులాల కోసం అంబేద్కర్ ఎనలేని కృషి చేశారని ఘట్‌కేసర్ అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు బిక్షపతి అన్నారు. ఆదివారం అంబేద్కర్ ఆలోచన విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంబేద్కర్ బాల్యంలో అంటరానితనం, అస్పృశ్యత ఉండేదన్నారు. ప్రపంచంలోని రాజ్యాంగాలను చదివి అందులోని మంచిని గ్రహించి భారత రాజ్యాంగంలో పొందుపరిచారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దాసు, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, బాలయ్య, రాజేశ్‌కుమార్, సత్యం, జగన్ పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం


విజేతలకు బహుమతులు అందజేసిన మిషన్ భగీరథ ఈఈ లక్ష్మీనారాయణ

పోచారం: వినాయక చవితి సందర్భంగా అన్నోజిగూడలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతి ప్రదానం చేశారు. 40 ఏళ్లలోపు జూనియర్ విభాగం సింగిల్స్‌లో ప్రథమ బహుమతిని నాగరాజు, ద్వితీయ బహుమతిని రాము, తృతీయ బహుమతిని సతీష్ గెలుచుకున్నారు. 40 ఏళ్లు పైబడిన సీనియర్స్ విభాగం డబుల్స్‌లో ప్రథమ బహుమతిని ఖలీల్, సంతోష్, ద్వితీయ బహుమతి విక్రమ్, మల్లిఖార్జున్, తృతీయ బహుమతి జగన్, శశి కైవశం చేసుకున్నారు. 40 ఏళ్లలోపు జూనియర్ విభాగం డబుల్స్‌లో ప్రథమ బహుమతిని నాగరాజు, సతీష్, ద్వితీయ బహుమతిని శ్రీనివాస్, బాలు, తృతీయ బహుమతిని హిమవర్ష్, మనోజ్ దక్కించుకున్నారు. ముఖ్య అతిథులుగా మిషన్ భగీరథ ఈఈ లక్ష్మీనారాయణ, పోచారం పోలీస్‌స్టేషన్ ఎస్సై వీరేశం, ప్యాట్‌బాయ్ కోచ్ అజయ్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు


కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో సునీతామహేందర్‌రెడ్డి

శామీర్‌పేట్: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం శామీర్‌పేట ఎస్‌జీ వెంచర్‌లో జరిగిన కార్యక్రమంలో శామీర్‌పేట మండలం, బాబాగూడ గ్రామానికి చెందిన 100 మంది నాయకులు సునీతామహేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్, నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు


పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు శ్రీపురం కాలనీలో సుమారు రూ.10 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు



కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతో పాటు, మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద భద్రతలో భాగంగా ఆదివారం పోలీసులు బాంబుస్క్వాడ్, పోలీస్ జాగిలాలతో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని మండపాల వద్ద ఈ తనిఖీలు చేపట్టడంతో పాటు, నిర్వాహకులకు పలు సూచనలు చేశామన్నారు.

హైటెన్షన్ టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్..

జవహర్‌నగర్: ఓ వ్యక్తి హైటెన్షన్ టవర్ ఎక్కి హల్‌చల్ చేసిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మదర్ థెరిస్సా కాలనీలో నివసించే వెంకటేష్, భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. పక్కింటి వారితో గొడవపడిన అతడు తనను కొట్టిన వారిని శిక్షించి న్యాయం చేయాలని హైటెన్షన్ టవర్ ఎక్కాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్‌ను నిలిపేసి వెంకటేష్‌ను కిందికి దింపారు. మద్యానికి బానిసైన అతడు గతంలోనూ ఇలాగే హల్‌చల్ చేశాడని పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేటి నుంచి ప్రత్యేక బస్సులు


సుధాకర్, మేడ్చల్ డిపో డీఎం

మేడ్చల్: ఆర్టీసీ బస్సుల్లో మేడ్చల్ నుంచి సికింద్రాబాద్‌కు ప్రయాణించే ప్రయాణికుల సౌకర్యార్థం నేటి నుంచి ప్రత్యేకంగా 5 మెట్రోడీలక్స్ బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సుధాకర్ తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి రాత్రి.8.55 నిమిషాల వరకు మెట్రోడీలక్స్ బస్సులు నడుపుతున్నట్లు ప్రకటించారు. మెట్రో డీలక్స్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, టీజీవైఎల్ టికెట్లు, ఆర్డినరీ పాసులు, మెట్రో పాసులు అనుమతించబడవని డీఎం స్పష్టం చేశారు. ఈ బస్సులో మేడ్చల్ ప్రధాన రూటైన 229 రూట్‌లో కొంపల్లి, సుచిత్ర, బోయినపల్లి మీదుగా తిరుగుతాయని వివరించారు.

రేపటి నుంచి మేడ్చల్‌లో జోనల్ క్రీడలు

మేడ్చల్: ఈనెల 10 వ తేదీ నుంచి మేడ్చల్ జోనల్ స్థాయి ఆటల పోటీలను మేడ్చల్‌లో నిర్వహిస్తున్నట్లు జోనల్ క్రీడల కార్యదర్శి వెంకట నారాయణ తెలిపారు. ఈనెల 10,11,12 తేదీలలో మేడ్చల్ జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అండర్–14, అండర్–19 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పాఠశాల నుంచి బోనఫైడ్, ఆధార్‌కార్డు, పాఠశాల ఐడీ కార్డు తీసుకురావాలని సూచించారు.

అన్నదానం

ఘట్‌కేసర్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈడబ్ల్యూఎస్ కాలనీలోని స్వామివివేకానంద యూత్ మండపం వద్ద మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్యయాదవ్ హాజరై అన్నదానం చేశారు. అంతకు ముందు గణనాథుడికి ప్రత్యేకపూజలు చేశారు. కౌన్సిలర్లు శశికళ, నర్సింగ్‌రావు, మల్లేశ్, రవీందర్, జహంగీర్, నాయకులు రాధాకష్ణ ముదిరాజ్, దేవేందర్, శశిధరన్, సురేష్, శ్రీనివాస్‌గౌడ్, రాంచందర్‌యాదవ్, రాజు పాల్గొన్నారు.



కలర్ పెయింట్స్ గోదాంలో అగ్నిప్రమాదం


నాచారం గోదాంలో ఎగిసిపడుతున్న మంటలు

మల్లాపూర్: కలర్ పెయింట్స్ కెమికల్ గోదాంలో శనివారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు, అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో నాచారం పారిశ్రామికవాడలోని రోడ్డు నెంబర్ 15లో నరేందర్‌కు చెందిన కలర్ పెయింట్స్ గోదాంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపకశాఖకు చెందిన 4 ఫైర్ ఇంజిన్‌లు ఘటనా స్థలానికి చేరుకొని రాత్రి 8 గంటల వరకు మంటలను ఆర్పివేశారు. వినాయక పండగ సందర్భంగా గోదాంలో ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. కంపెనీ ఆనుకొని ఉన్నా తిరుమల ఉడ్స్ కాలనీవాసులు దట్టమైన పొగ, మంటలు రావడంతో భయభ్రాంత్రులకు గురయ్యారు. ఆస్తినష్టం అనేది ఎంతమేర జరిగిందని ఇంకా అంచనాకు రాలేదు. ఘటనా స్థలాన్ని మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, శాంతి సాయిజెన్‌శేఖర్ పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గణపతి మండపం వద్ద గొడవ..
8 మందిపై కేసు నమోదు

మల్లాపూర్: వినాయక మండపం వద్ద గొడవ జరగడంతో ఇరువర్గాలపై నాచారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 9 గంటల సమయంలో మల్లాపూర్ బ్రహ్మపురికాలనీ 51 బస్టాప్ సమీపంలో సతీష్‌తో పాటు కాలనీవాసులు వినాయకుడిని ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపులా లైటింగ్ ఏర్పాటు చేస్తున్న సమయంలో ద్విచక్ర వాహనంపై ఎండీ యాకుబ్ పాషా, ఖాజాబాబా అటువైపుగా వస్తుండగా రోడ్డుకు అడ్డుగా కర్రలు ఉన్నాయి. దీంతో సతీష్ పక్క రోడ్డు నుంచి వెళ్లాలని సూచించడంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి గొడవకు దారితీసింది. కాలనీవాసులు ఇరువురిని ఇంటికి పంపించారు. యాకుబ్ పాషా, ఖాజాలు కలిసి మరో ఐదుగురితో సతీష్ ఇంటిపై దాడికి పాల్పడ్డారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. రాత్రే నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్‌తో పాటు పోలీసు ఉన్నాతాధికారులు గొడవ జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనలో మొత్తం 8 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కాప్రా చెరువులో నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన


కాప్రా చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన సీపీ సుధీర్‌బాబు

కాప్రా: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కాప్రా చెరువులో నిమజ్జన ఏర్పాట్లను రాచకొండ సీపీ సుధీర్‌బాబు, జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ పరిశీలించారు. ఆదివారం సాయంత్రం కాప్రా చెరువును సందర్శించిన ఆయన నిమజ్జనాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు వివరించారు. నిమజ్జనం చేసే చెరువులు, కుంటల వద్ద క్రేన్లు, బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. గణపతి నిమజ్జనాల కోసం వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించామని తెలిపారు. గజ ఈతగాళ్లను కూడా చెరువుల వద్ద అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి ఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు పూర్తయ్యేలా తగిన చర్యలు చేపట్టినట్లు చెప్పారు. డీసీపీ పద్మజ, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో ఏర్పాట్లు : జెడ్సీ హేమంత్

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిమజ్జన ఏర్పాట్ల కోసం అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకెళ్తున్నట్లు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ తెలిపారు. ఆదివారం ఉదయం కాప్రా చెరువును సందర్శించిన జెడ్సీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. కాప్రా డిప్యూటీ కమిషనర్ జగన్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షల వెల్లువ


పుష్పగుచ్ఛం అందజేసిన కౌన్సిలర్ వెంకటేష్‌గౌడ్


శుభాకాంక్షలు తెలుపుతున్న వేముల మహేష్‌గౌడ్ తదితరులు

పోచారం: టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను పోచారం మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్, మాజీ పీసీసీ ప్రతినిధి బాలగోని వెంకటేశ్‌గౌడ్ ఆదివారం కలిసి ఘనంగా సత్కరించారు. కులాల వారీగా సమతుల్యతను పాటిస్తూ టీపీసీసీ అధ్యక్ష పదవిని మహేష్‌కుమార్‌గౌడ్‌కు కేటాయిస్తూ పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయంపై వెంకటేశ్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మీడియా కో– ఆర్డినేటర్ శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ : నూతన పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ బీ–బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కలిశారు. ఆదివారం ఉదయం ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ శివకుమార్, భాస్కర్‌రెడ్డి, నాగేష్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, నర్సింహ్మా, రాజేందర్‌గౌడ్, నరేష్‌గౌడ్, సురేష్‌నాయక్, శ్రవణ్‌కుమార్, సందీప్‌రెడ్డి, నాగరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

సంస్కృతి టౌన్‌షిప్ ఆర్థిక నివేదికపై చర్చ

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా 2023–24 ఆర్థిక నివేదికపై జరిగిన చర్చలో పలువురు సభ్యులు మాట్లాడుతూ.. కోర్టు కేసులపై అసోసియేషన్ ఇష్టానుసారంగా డబ్బు ఖర్చు చేస్తోందని ఆరోపణలు చేశారు. అనవసరమైన కేసుల జోలికి వెళ్లకుండా కాలనీవాసులకు అవసరమైన వసతుల కల్పన దిశగా అసోసియేషన్ పనిచేయాలన్నారు. నివేదికలో పేర్కొన్న పలు రకాల పద్దులపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కోశాధికారి సంతకం లేకుండా ఎలాంటి చెల్లింపులు చేయకూడదని డిమాండ్ చేశారు. మాజీ అధ్యక్షుడు బద్దం వెంకట్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు బెజ్జంకి హరిప్రసాదరావులు మాట్లాడారు. ఉపాధ్యక్షుడు పీవీఎస్ సత్యనారాయణ, కార్యదర్శి పీఎస్ ఇందిరా ప్రియదర్శిని, కోశాధికారి భగవాన్, కార్య నిర్వాహక సభ్యులు అభిషేక్, అనునయ్ ఆశిష్, జీఎస్ ప్రతిభ, అడబాల జోగేశ్వరరావు, కస్తూరి ప్రగతి, కొండయ్య, కేపీఆర్ శశిధర్‌లాల్, మందడి మంజుల, మాజీ అధ్యక్షుడు శ్రీగిరి వెంకట్‌మాధవ్‌రెడ్డి, మాజీ కార్యదర్శి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధ్యక్షుడు హరిప్రసాదరావు


వచ్చే నెల 6న రెడ్డి ప్రజాప్రతినిధుల సన్మానసభ


సన్నాహక సమావేశంలో రాష్ట్ర రెడ్డి జేఏసీ, రెడ్డి జాగృతి అధ్యక్షులు తదితరులు

కీసర: రెడ్డి జేఏసీ, రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో అక్టోబర్ 6న నగరంలోని హైటెక్‌సిటీ శిల్పకళావేదికలో నిర్వహించనున్న రెడ్డి ప్రజాప్రతినిధుల సన్మాన సభను విజయవంతం చేసేందుకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు చెందిన ప్రతి ఒక్క రెడ్డి బిడ్డ ముందుకురావాలని రెడ్డి జేఏసీ చైర్మన్ అప్పమ్మగారి రాంరెడ్డి, రెడ్డి జాగృతి అధ్యక్షులు బుట్టింగారి మాధవరెడ్డిలు పిలుపునిచ్చారు. ఆదివారం మేడ్చల్‌జిల్లా కీసరలోని ఎస్.వీ.ఆర్ ఫంక్షన్‌హాల్ నిర్వహించిన సన్నాహక సమావేశానికి వివిధ జిల్లాలకు చెందిన రెడ్డి జేఏసీ, రెడ్డి జాగృతిలకు చెందిన సభ్యులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సన్మానసభకు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు, రెడ్డి కులస్తులకు సంబంధించిన మంత్రులతోపాటు, రెడ్డి ప్రజాప్రతినిధులైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను ఘనంగా సత్కరించాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, రెడ్డి కార్పొరేషన్‌కు చట్టబద్ధత కల్పించడంతో పాటు, రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళా అధ్యక్షురాలు వసంతరెడ్డి, కో– చైర్మన్ పైళ్ల హరినాథ్‌రెడ్డి, కోలన్ వెంకటేశ్వరరెడ్డి, రామ్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, కేశవరెడ్డి, రామిడి ప్రభాకర్‌రెడ్డి, రామిడి విజయ్‌రెడ్డి, గుర్రం లక్ష్మారెడ్డి, బండారి శ్రీనివాస్‌రెడ్డి, కందాడి శివరాంరెడ్డి, నల్ల వెంకట్‌రెడ్డి, మధుకర్ రెడ్డి, మల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, బస్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు.